సాక్షి
ములుగు
శుక్రవారం । 5 । జూలై । 2024



ఆస్కార్ గ్రంథాలయం.. దేవాలయం

ఆస్కార్ గ్రంథాలయం.. ఒక దేవాలయమని, దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. - 8లో▸



అసైదులా హోరతి..

త్యాగం.. శాంతికి ప్రతీక మొహర్రం. ప్రజాస్వామ్యం.. మానవ హక్కుల పరిరక్షణ కోసం 14 శతాబ్దాల క్రితమే జరిగిన చారిత్రాత్మక పోరాటమే మొహర్రం. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.1°/26.2°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

వాజేడు: ప్రభుత్వం ఐటీఐ కళాశాలలో చేరడానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆగస్టు 2024–2025 విద్యా సంవత్సరానికి గాను రెండో విడత దరఖాస్తులను ఈ నెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రీషియన్ 13, ఫిట్టర్ 189, ఎలక్ట్రానిక్స్ 24, డ్రాఫ్ట్ మెన్ సివిల్ 24, కోపా 47 సీట్లల్లో చేరడానికి విద్యార్థులకు అవకాశం ఉందని వివరించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి 1ఆగస్టు 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి



ములుగు: జిల్లా వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ కలెక్టర్ టీఎస్. దివాకరను కోరారు. ఈ మేరకు ఆయన కలెక్టర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. ప్రధానంగా చెరువులు, సరస్సుల కాల్వల ద్వారా పంట పొలాలకు నీరు అందించేలా చూడాలని కోరారు.

నిధులు విడుదల చేయాలి

భూపాలపల్లి అర్బన్: పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలని కోరుతూ.. దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఏఓ మహేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మరాఠీ కాంతారావు, రాసపల్లి భద్రయ్య మాట్లాడారు. అర్హులైన వారందరికీ వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద దళితవాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నేరెళ్ల జోసఫ్, పానగంటి లావణ్య, పీక రవికాంత్, బౌద్ధ కమలాకర్, పెద్దమామల సంధ్య పాల్గొన్నారు.

మహదేవపూర్ పీఏసీఎస్‌కు ఎక్సలెన్స్ అవార్డు



కాళేశ్వరం: జాతీయ కో–ఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన (ఎన్‌సీడీసీ) ప్రాంతీయ కో–ఆపరేటివ్ ఎక్సలెన్స్, మెరిట్ 2023 అవార్డుల్లో భాగంగా మహదేవపూర్ ప్రాథమిక సహకార సంఘానికి అవార్డు వచ్చిందని చైర్మన్ చల్ల తిరుపతయ్య గురువారం తెలిపారు. సంఘం సేవలు, పని విధానాలు గుర్తించి రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీజీక్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అవార్డు అందజేసినట్లు చెప్పారు. అవార్డుతో పాటు రూ.25వేల చెక్కు ప్రోత్సాహకాన్ని చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ పెండ్యాల అనిల్ అందుకున్నారు.

సింగరేణి ప్రైవేటీకరణ ఆపాల్సిందే..

భూపాలపల్లి అర్బన్: బొగ్గు గనుల ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి ఏరియాలోని కొమురయ్య భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడారు. ప్రైవేటీకరణను నిరసిస్తూ నేడు (శుక్రవారం) జిల్లాకేంద్రంలో వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సింగరేణి వేలం పాటను వేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 5వ తేదీ నుంచి 15వరకు దశలవారీగా ఆందోళనలకు పిలుపునిచ్చినట్లు చెప్పారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం

భూపాలపల్లి అర్బన్: యునైటెడ్ స్టూడెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని, అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని విద్యాసంస్థలను పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా చేపట్టి ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు.

‘ఆస్పిరేషనల్’తో అభివృద్ధి

కన్నాయిగూడెం ప్రగతికి బాటలు

- ఏబీపీ కింద పైలట్ ప్రాజెక్టుగా మండలం ఎంపిక
- ఆరు ఇండికేటర్ల అమలుకు అధికారుల నిర్ణయం
- లాంఛనంగా సంపూర్ణత అభియాన్ ప్రారంభం



సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ



మెడికల్ క్యాంపు ప్రారంభిస్తున్న శ్రీజ



విద్యార్థికి పోషకాహారం పంపిణీ చేస్తూ..

ములుగు: నీతి ఆయోగ్ సూచనల మేరకు జిల్లాలోని అన్నిరంగాల్లో వెనుకబడిన కన్నాయిగూడెం మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ) కింద ఎంపికైంది. నీతి ఆయోగ్–2023లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో 10మండలాలను ఎంపిక చేసుకోగా ములుగు జిల్లా తరఫున కన్నాయిగూడేన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఆస్పిరేషనల్ బ్లాక్ కింద ఆయా శాఖల తరఫున అమలు చేయాల్సిన సుమారు 40 ఇండికేటర్లు ఉండగా కన్నాయిగూడెంలో ఆరు ఇండికేటర్లను అమలు చేయనున్నారు. దీనికి సుమారు మూడు నెలల(సెప్టెంబర్ 30వ రకు) పాటు యాక్షన్ ప్లాన్ ఎంచుకొని ఆయా శాఖల తరఫున ప్రజలకు అందాల్సిన ప్రత్యేక సేవలను పర్యవేక్షించి అందుబాటులో ఉన్న నిధులతో సంక్షేమాలను అమలు చేయనున్నారు.

ఆరు ఇండికేటర్ల అమలుకు..

కన్నాయిగూడెం మండలంలో ఆరు ఇండికేటర్స్(సూచికలు)ను ఎంచుకోగా అందులో వైద్యశాఖ తరఫున ఏఎన్‌సీ, హైపర్ టెన్షన్, షుగర్, న్యూట్రిషన్ ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ తరఫున సాయిల్ టెస్ట్, సోషల్ డెవలప్‌మెంట్, బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రధానంగా ఉన్నాయి. వీటిలో హెల్త్‌కేర్ తరఫున హైపర్ టెన్షన్, మొదటి త్రైమాసికంలో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, షుగర్, అంగన్‌వాడీల నుంచి అందే సప్లిమెంటరీ న్యూట్రిషియన్, అగ్రికల్చర్ తరఫున క్లస్టర్ల వారీగా సాయిల్ టెస్టులు నిర్వహిస్తారు. సాగు చేయాల్సిన పంటలపై తగిన సూచనలు చేస్తారు. అదేవిధంగా సోషల్ డెవలప్‌మెంట్, ఎస్‌హెచ్‌జీల అభివృద్ధి అంశాలను ఎంచుకున్నారు. ఈ క్రమంలో మండలంలో ఇండికేటర్లు అమలు చేయడానికి తగిన డేటాను నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ కమిటీ సేకరించే పనిలో పడింది.

‘సంపూర్ణత అభియాన్’ ప్రారంభం

కన్నాయిగూడెం: మండల కేంద్రంలో గురువారం సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని నీతి ఆయోగ్ ప్రొఫెషనల్ గాయత్రి, అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ శ్రీజ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె సంపూర్ణత అభియాన్ కార్యక్రమంపై అధికారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధాన రహదారిపై ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలుపడమే ఆస్పిరేషనల్ బ్లాక్ లక్ష్యమన్నారు. నీతి ఆయోగ్ కార్యక్రమంలో భాగంగా ఆస్పిరేషనల్ బ్లాక్‌గా కన్నాయిగూడెం మండలం ఎంపికైందని తెలిపారు. ఇందులో భాగంగా వైద్య రంగం, వ్యవసాయం, పౌష్టికాహారం, సాంఘిక సంక్షేమ తదితర కార్యక్రమాలను అమలు చేసి కన్నాయిగూడెం మండలాన్ని అభివృద్ధి చేసేందుకు నీతి ఆయోగ్ సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. కార్యక్రమ లక్ష్య సాధనకు ప్రజలు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఆస్పిరేషనల్ బ్లాక్ ద్వారా మండలాన్ని వందశాతం అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య, డీడబ్ల్యూఓ స్వర్ణలత, ఎంపీడీఓ అనిత, ఎంపీఓ రామకృష్ణ, స్థానిక వైద్యుడు అభినవ్, ఏపీఓ సురేష్, నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ కో ఆర్డినేటర్ రవీష్, ఏపీఎం కమలాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యవర్తిగా పనిచేస్తాం..



నీతి ఆయోగ్ సూచనల మేరకు జిల్లాలోని కన్నాయిగూడెం మండలాన్ని ఆస్పిరేషనల్ బ్లాక్ మండలంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యవర్తిగా పనియడంతో పాటు ఆరు ఇండికేటర్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. అదే విధంగా ఆయా శాఖల నిధులతో న్యూట్రిషనల్, మెడికల్, ఎడ్యుకేషన్, మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తాను. మూడు నెలల సమయంలో సాయిల్ టెస్ట్ విషయంలో కాస్త ఆలస్యం జరిగే అవకాశం ఉంది.

– రవీష్, నీతి ఆయోగ్ కోఆర్డినేటర్

మావోయిస్టులకు ఆశ్రయం ఇవ్వొద్దు

ఎస్పీ శబరీశ్



గొత్తికోయలకు సూచనలు చేస్తున్న ఎస్పీ శబరీశ్

ములుగు: మావోయిస్టులకు ఎవరూ ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్పీ శబరీశ్ అన్నారు. జిల్లాలోని ములుగు, వెంకటాపురం(ఎం), పస్రా, ఎస్ఎస్ తాడ్వాయి, ఏటూరునాగారం, పేరూరు, మంగపేట, వెంకటాపురం(కె) మండలాల్లోని గొత్తికోయ గూడేలను స్థానిక పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణలో నిషేధిత సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు పార్టీ పూర్తి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందన్నారు. ఎవరైనా మావోయిస్టులు, మిలిషీయా సభ్యుల పేరుతో ఆశ్రయం కోరడానికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు వారికి అండగా ఉంటామని తెలిపారు. మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాలైన గొత్తికోయ గుంపులపై నిఘాను మరింత పటిష్టం చేస్తున్నామని తెలిపారు. మావోయిస్టుల సమాచారం అందించిన వారికి నగదు బహుమతి అందిస్తామన్నారు. ఏజెన్సీలోని ఆదివాసీలకు విద్యా, వైద్యం, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు కల్పించేందుకు దృష్టి సారిస్తున్నామని వివరించారు. ఏజెన్సీలోని మావోయిస్టు ప్రాంతాలను పోలీసులు సందర్శించి గొత్తికోయలకు మావోయిస్టులకు ఆశ్రయం ఇవ్వద్దని తగిన సూచనలు చేసినట్లు వెల్లడించారు. మావోయిస్టుల ఆచూకీ తెలిపిన వారికి నగదు బహుమతి అందిస్తామని వాల్‌పోస్టర్లను సైతం అంటించినట్లు వెల్లడించారు.

పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్ మహేందర్ జీ

ములుగు: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, ఉద్యమంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని అదనపు కలెక్టర్(రెవెన్యూ) సీహెచ్.మహేందర్ జీ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్‌లో గల వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ మాహేందర్‌జీ ముఖ్య అతిథిగా హాజరై కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభంలో భూమికోసం, భుక్తికోసం, విముక్తి ఉద్యమం పోరాటంగా మారడానికి దొడ్డి కొమురయ్య అమరత్వమే ప్రధాన కారణమన్నారు. తెలంగాణ సాయుధ పోరాట మహోన్నత ఉద్యమానికి కొమురయ్య ఆద్యుడని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ రాజ్‌కుమార్, మేకల మహేందర్, ముంజాల భిక్షపతిగౌడ్, సంక్షేమ భవన కార్యాలయ సిబ్బంది, బీసీ వెల్ఫేర్ అధికారులు సరిత, మానస, రేణుక, కుమారస్వామి, ప్రతాప్, గోపాల్ చారి, రత్నాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

కన్నాయిగూడెం: ఏటూరునాగారం నుంచి కన్నాయిగూడెం వరకు ఉన్న విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంతో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ములుగు డీఈ నాగేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటూరునాగారం నుంచి కన్నాయిగూడెం వరకు ఉన్న 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు శుక్రవారం నుంచి సోమవారం వరకు పనులు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వర్షం వస్తే పనులను మరుసటి రోజుకు వాయిదా వేయనున్నట్లు పేర్కొన్నారు. దీనికి మండలంలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు



సమావేశంలో మాట్లాడుతున్న మధు

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో సీఐటీయూ జిల్లా నాయకుడు ఎండీ దావూద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్కీం వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం రూ. 26వేలు చెల్లించాలన్నారు. సీఐటీయూ ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10న చేపట్టిన కార్మికుల కోరికల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రైవేటీకరణ విధానాలను వేగం చేస్తుందన్నారు. లేబర్ కోడ్‌ల అమలు చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నం రాజేందర్, గుండబోయిన రవిగౌడ్, నీలాదేవి, మహేష్, సరిత, సంధ్య, రాజ్యలక్ష్మీ, శ్రావ్య, నాగలక్ష్మీ, మంజూల తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’ మళ్లీ నిర్వహించాలి

కలెక్టరేట్ ఎదుట వామపక్ష విద్యార్థి సంఘాల నాయకుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

ములుగు రూరల్: నీట్ ఫలితాలను రద్దు మళ్లీ పరీక్షను నిర్వహించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్షల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషిలను బర్తరఫ్ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నీట్ అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేపట్టాలన్నారు. దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌కు సహకరించిన సంస్థలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. నీట్ పరీక్షల కారణంగా 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడి శెట్టి కోటి, కుమ్మరి సాగర్, తోకల రవి, రత్నం ప్రవీణ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పూనెం సాయి

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో గురువారం గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఆదివాసీల భూములకు రక్షణ కరువైందని తెలిపారు. వలస గిరిజనేతరులు ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూనెం మునేశ్వరరావు, యాలం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచెరువులో జాయింట్ సర్వే

కాళేశ్వరం: చిన్నకాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మహదేవపూర్ మండలం ఎర్రచెరువులో గురువారం అధికారులు జాయింట్ సర్వే చేపట్టారు. ఆర్డీఓ మంగీలాల్, ఫారెస్టు ఎఫ్‌డీఓ వజ్రా రెడ్డి, ఇరిగేషన్ ఈఈ యాదగిరి జాయింట్ సర్వే చేశారు. వారి వెంట తహసీల్దార్ ప్రహ్లాద్, డీటీ కృష్ణ, రేంజర్ కమల, డీఈఈ, ఏఈఈలు ఉన్నారు.

కేవీ ఏర్పాటుకు స్థల పరిశీలన



అన్నంపల్లి శివారులో కేవీ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్



సారంగపల్లి పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

ములుగు రూరల్: మండల పరిధిలోని జగ్గన్నపేట పంచాయతీ పరిధిలో గల సారంగపల్లి వద్ద అన్నంపల్లి రెవెన్యూ శివారులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కలెక్టర్ టీఎస్.దివాకర స్థల పరిశీలన చేపట్టారు. ఈ మేరకు గురువారం రెవెన్యూ అధికారులు 6ఎకరాల భూమిని కలెక్టర్‌కు చూపించారు. అనంతరం చిన్నగుంటూరుపల్లి సమీపంలో సమీకృత గురుకులాల విద్యా సంస్థల ఏర్పాటుకు అవసరమైన 20ఎకరాలను భూమిని పరిశీలించారు. ఇంచర్ల శివారులో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఇంచర్ల శివారులోని ఏకో పార్కులో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. ఎర్రిగట్టమ్మ సమీపంలో 63హెక్టార్లల్లో జరుగతున్న పనులను జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం, గురుకులాల విద్యా సంస్థల నిర్మాణాలకు అనువుగా ఉన్న స్థలం సేకరించాలని సూచించారు. పార్కులో ఒకే రోజు 10వేల మొక్కలు నాటే కార్యక్రమ వివరాలను, ప్లాంటేషన్ వివరాలపై డీఎఫ్‌ఓతో చర్చించారు. జాతీయ రహదారికి అందుబాటులో ఉన్న ఏకో పార్కు పనులు, సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వన మహోత్సవం కింద నాటే మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ భాస్కర్, ములుగు రేంజ్ ఆఫీసర్ డోలి శంకర్, ఆర్ఐ విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ టీఎస్. దివాకర అన్నారు. మండల పరిధిలోని జగ్గన్నపేట పరిధి సారంగపల్లిలోని ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ యూనిఫాం, మధ్యాహ్న భోజన మెనూ అమలు చేస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులను పరిశీలించి హెచ్‌ఎంకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సర్వన్‌కుమార్, తహసీల్దార్ విజయ భాస్కర్, ఆర్ఐ విజేందర్ పాల్గొన్నారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి: గంజాయి సేవించి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ కిరణ్‌ఖరే సూచించారు. గురువారం భూపాలపల్లి సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల అవగాహన, గంజాయి సేవిస్తూ పట్టుబడిన వారికి భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, గంజాయి వినియోగదారులు, రవాణాదారులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గంజాయి రవాణా చేసే ముఠాలపై కఠిన చర్యలు తప్పవని, నియంత్రణకు జిల్లా టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాకు సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లోని గడ్చిరోలి, చంద్రాపూర్, బీజాపూర్ నుంచి గంజాయి రవాణా అయ్యే అవకాశం ఉందని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ టీంలు గంజాయి రవాణాదారులకు చెక్ పెడతాయని అన్నారు. పదేపదే నేరాలకు పాల్పడుతూ, గంజాయి రవాణాచేస్తూ పట్టుబడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై వారి భవిష్యత్‌ని నాశనం చేసుకోవద్దనే ఉద్దేశంతో ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పూజలు నిర్వహించారు. అర్చకులు రాజ్‌కుమార్ ఆలయంలో శివలింగానికి పంచామృత అభిషేకాలు, సహస్ర ఘటాభిషేకం నిర్వహించి శివలింగాన్ని అన్నంతో అన్నపూర్ణేశ్వరిగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మడుగూరి ప్రసాద్, కిరణ్, రాంలాల్, నర్సింహులు, దుర్గం కొమురయ్య, కర్ల అరుణ, కాటుకూరి రాధిక, లాలమ్మ, గారపోశాలు, వేణుగోపాల్‌లాహోటి, పాపన్న, పోగుల లక్ష్మీనారాయణ, చిటమట రఘు, తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను నిరసిస్తూ గురువారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఏరియా జీఎం కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశ వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తుందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా బొగ్గు గనులను వేలం వేస్తుందన్నారు. అందులో భాగంగా తెలంగాణలో మూడు బ్లాక్‌ను ప్రైవేట్‌కు అప్పగించాలని మరో బ్లాక్‌ను టెండర్ వేసే ప్రక్రియను ప్రారంభించిందని చెప్పారు. అన్ని సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టగా టెండర్లను వాయిదా వేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుకర్ రెడ్డి, రఘుపతిరెడ్డి, ఆశోక్, నర్సింగరావు, శ్రీనివాస్, సంపత్, కృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన స్పోర్ట్స్ హాస్టల్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రాంతీయ వసతి గృహ ఎంపిక పోటీలు గురువారం ముగిశాయి. జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్ క్రీడలలో నిర్వహించిన ఎంపిక పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించిందని హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్ జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జిమ్, మెడిసిన్ బాల్‌త్రో, 800 మీటర్ల పరుగుపందెం, బ్యాటరీ టెస్టులు నిర్వహించామన్నారు. క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా పాయింట్లు కేటాయించి తుది జాబితా 'శాట్'కు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచ్‌ల బృందం ఆధ్వర్యాన నిర్వహించిన ఎంపికల్లో డీఎస్‌ఏ కోచ్‌లు, క్రీడా సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ కాంట్రాక్టర్‌పై దాడి

- కర్రలతో కారు అద్దాలు ధ్వంసం
- మహిళ, చిన్నారికి గాయాలు



దాడిలో గాయపడిన కాంట్రాక్టర్ రాజు, అతడి భార్య, కూతురు, బావ

తరిగొప్పుల: కల్వర్టు నిర్మాణ పనులు చేస్తున్న సబ్ కాంట్రాక్టర్‌పై కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఈ దాడిలో కారు అద్దాలు ధ్వంసం కాగా కాంట్రాక్టర్‌తో పాటు అతడి భార్య, చిన్నారి, బావకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి కథనం ప్రకారం.. హనుమకొండ హంటర్‌రోడ్‌కు చెందిన బొమ్మిశెట్టి రాజు మండలంలోని సోలిపూర్, పోతారం గ్రామాల మధ్యలో కల్వర్టు నిర్మాణ పనులు చేపడుతున్నాడు. ఈ క్రమంలో రైతు కందుల యాదగిరి తన వ్యవసాయ భూమికి నష్టం కలుగుతుందని కల్వర్టు నిర్మాణ పనులు అడ్డుకున్నాడు. గతంలోనే కొంత పరిహారం ఇవ్వగా మళ్లీ డబ్బు కావాలని బుధవారం డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్, సదరు భూమి యజమానికి స్వల్ప వివాదం చోటుచేసుకుంది. బొమ్మిశెట్టి రాజు సోలిపూర్‌లో అద్దెకుంటున్న ఇంటి నుంచి తన కారులో స్వగ్రామం వెళ్తున్నాడు. ఈ క్రమంలో కందుల యాదగిరితో పాటు అతడి కుమారులు మధు, సతీశ్, నరేశ్ అడ్డగించి కర్రలతో కారుపై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. కారులో కూర్చున బొమ్మిశెట్టి రాజును కిందకు లాగి కర్రలతో దాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా కాంట్రాక్టర్‌పై భార్య శ్యామల, చిన్నారి నిషిక, బావ శివరాత్రి మధుపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బొమ్మిశెట్టి రాజు తెలిపారు. ఈ విషయమై ఎస్సై శ్వేతను వివరణ కోరగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అసైదులా హారతి..



పీరీల ఊరేగింపు(ఫైల్)

- 17న మొహర్రం
- పీరీల ముస్తాబు

కాజీపేట : త్యాగం.. శాంతికి ప్రతీక మొహర్రం. ప్రజాస్వామ్యం.. మానవ హక్కుల పరిరక్షణ కోసం 14 శతాబ్దాల క్రితమే జరిగిన చారిత్రాత్మక పోరాటమే మొహర్రం. స్థానికంగా పీరీల పండుగ అంటున్నా మొహర్రం పండుగ కాదు. కర్బలా మైదానంలో జరిగిన యుద్ధంలో మృతి చెందిన వారి జ్ఞాపకార్థం శోక (సంతాప) దినాలుగా ఆచరిస్తారు. మొహర్రంలోని పది రోజులు విషాదదినాలే. ముస్లింలే కాకుండా ముస్లిమేతరులూ సమభావం, సామరస్యంతో కార్యక్రమాల్లో పాలు పంచుకుంటారు. కాగా, మొహర్రం మాసం ఆరంభం నుంచి ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇమామ్ హుస్సేన్ వీరమరణానికి నిదర్శనంగా చావిడి (మఖానం)లో పీరీలను కూర్చోబెట్టి పది రోజులపాటు ప్రార్థనలు చేస్తారు. కుల, మతాలకతీతంగా అందరూ పాల్గొని పీరీల వద్ద ప్రత్యేక పూజలు, చదివింపులు (ఫాతేహాలు) జరపడం విశేషం. మత సామరస్యతకు ఇది గొప్ప నిదర్శనంగా చెప్పొచ్చు. 10వ రోజు తెల్లవారుజామున 3.30 గంటలకు అగ్నిగుండంలోకి పీరీలు ప్రవేశించి ఊరంతా గ్రామోత్సవం జరుపుకుంటాయి. ఇస్లామియా భాషలో 'అషురా' అంటారు. ప్రాణత్యాగం చేసిన ఉదంతాన్ని షహదత్‌గా (ఈనెల 17న మొహర్రం) నిండు శోకంతో జరుపుతారు. ఊరేగింపు సమయంలో పీరీలను ప్రతి ఇంటి ముందు ఆపుతారు. ఆ సమయంలో ఇంటివారు బిందెలతో నీటిని తెచ్చి పీరీలను ఎత్తుకున్న వారి పాదాలను శుభ్రం చేసి పాద నమస్కారాలు చేసుకుంటారు. కులమతాలకతీతంగా భక్తి ప్రవత్తులను చాటుకుంటారు. అదేరోజు సాయంత్రం పీరీలను చావిడి నుంచి తీసుకుని గ్రామ శివారులోని పొలిమేర వరకు తీసుకెళ్లి వాటిని శుభ్రం చేసి మళ్లీ చావిడికి తీసుకొస్తారు. అప్పుడు మొహర్రం పూర్తవుతుంది.

17న మొహర్రం.. బీబీకా ఆలం

17వ తేదీ మధ్యాహ్నం నుంచి పీరీలను మరోసారి గ్రామంలో ఊరేగిస్తారు. పీరీలు ఏటికి పోతుంటే భక్తులంతా బెల్లం, నువ్వులు కలిపిన గట్టాలను చల్లుతుంటారు. గ్రామశివారులోని పొలిమేర వరకు తీసుకెళ్లాక అక్కడ పీరీలను శుభ్రంచేసి ఓ మూట కడుతారు. 'ఆల్‌బిదాయో ఏకుసేని' అంటూ బీబీకా ఆలం పాటను ఆలపిస్తూ పీరీలతో పాటు వాటికి అమర్చిన కర్రలు, దట్టీలను మఖానం వరకు తీసుకువస్తూ రోదిస్తుంటారు.

త్యాగ స్మృతులకు నిదర్శనం



ఇమామ్‌హుస్సేన్ మానవత్వానికి జీవం పోసిన ధీరుడు. ఇరాక్ రాజు యాజిద్ అన్యాయాన్ని ఎదుర్కోవడంలో వీరమరణం పొందారు. ఆయన త్యాగాలను స్మరించుకుంటూ, ధర్మపరిపాలనను మెచ్చుకుంటూ ఏటా మొహర్రం మాసంలో వచ్చే ఈ శోకదినాలను జరుపుకుంటాం. అన్ని మతాల వారు పీరీల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూ సామరస్యతకు ప్రతీకగా నిలుస్తున్నారు.

\- అమ్మాబాయి, కాజీపేట

మొక్కుబడులు ఘనంగా...

మేళతాళాలు, డప్పు చప్పుళ్లతో ఇంటికి వచ్చిన పీరీలకు ఆ ఇంటివారు పూలు, కాగితాలతో అందంగా తయారు చేసిన బాసింగాలు, రంగుల దట్టీలు, వెండి, బంగారు గొడుగులు, తొట్టెలు ఇచ్చి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటారు. ఇళ్ల నుంచి పానకం, వడపప్పు, చక్కెర, బెల్లం, ఎండు కొబ్బరిని మఖానం వరకు సపరివారంగా తీసుకొచ్చి సమర్పిస్తారు. వీటిని స్వీకరించిన చావిడి.. (పూజారి) ముతవలి పీరీలను ఎత్తుకున్న వారికి భక్తితో సమర్పిస్తారు.

జియారత్

మొహర్రం అనంతరం మూడురోజులకు జియారత్ నిర్వహిస్తారు.

22న దాశరథి శతజయంతి ఉత్సవాలు

- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

మహబూబాబాద్: ఈనెల 22న నిర్వహించే దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, గాయకుడు దేశపతి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శతజయంతి రోజు ఉదయం 9 గంటలకు చిన్నగూడూరులోని దాశరథి విగ్రహానికి పూల మాల వేసిన అనంతరం అక్కడ నుంచి జిల్లా కేంద్రానికి బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎం ఫంక్షన్ హాల్‌లో శత జయంతి సభ ఉంటుందన్నారు. శత జయంతి ఉత్సవాలను ఈ ఏడాది జూలై 22 నుంచి వచ్చే ఏడాది జూలై 22 వరకు ఏడాది పాటు నిర్వహిస్తామన్నారు. జయంతి సభకు ప్రముఖ కవులతో పాటు మానుకోట , డోర్నకల్ ఎమ్మెల్యేలు, మానుకోట ఎంపీని కూడా ఆహ్వానిస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు,మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు మంగళంపల్లి కన్నా , ఎడ్ల వేణుమాధవ్, గాడిపల్లి మధు, గుర్రపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయాలి..

- మృతురాలి బంధువుల డిమాండ్
- భర్త ఇంటి ఎదుట భార్య మృతదేహంతో ధర్నా
- డీఎస్సార్ జెండాల్‌తండాలో ఘటన



అనూష మృతదేహంతో ధర్నా చేస్తున్న బంధువులు

మరిపెడ రూరల్: పెళ్లి అయినా మరో పెళ్లి చేసుకుని భర్త తనను మోసం చేశాడని భార్య బాదావత్ అనూష ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విధితమే. ఈ విషయంపై భర్త ఇంటి ఎదుట అనూష మృతదేహంతో బంధువులు ధర్నా చేపట్టారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం డీఎస్సార్ జెండాల్ తండా జీపీ పరిధిలోని ఆముదాలగడ్డతండాలో గురువారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన బాదావత్ అనూష (20) అదేతండాకు చెందిన వివాహితుడు భూక్య సురేశ్ ప్రేమించుకుని రెండు సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకున్నారు. కొంతకాలం పాటు వీరి కాపురం సజావుగా జరిగింది. అయితే ఇటీవల మొదటి భార్య జ్యోతి, రెండో భార్య అనూష, సురేశ్ మధ్య నిత్యం గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో అనూషను భర్త సురేశ్.. మొదటి భార్య బంధువులతో కలిసి తీవ్రంగా కొట్టాడు. దీనికి తోడు సురేశ్ కత్తితో నిత్యం బెదిరించడంతో పాటు వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన అనూష.. నా చావుకు కారణం భర్త సురేశ్ అని సూసైడ్ రాసి బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టం అనంతరం మృతురాలి కుటుంబీకులు తమకు న్యాయం చేయాలని సురేశ్ ఇంటి ఎదుట అనూష మృతదేహంతో ధర్నా చేపట్టారు. దీంతో 20 గంటల పాటు తండాలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న మరిపెడ సీఐ హత్తిరాం నాయక్, ఎస్సైలు తహెర్‌బాబా, సంతోష్ హుటాహుటినా ఘటనాస్థలికి చేరుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేసి సురేశ్‌కు శిక్షపడేలా చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ఆస్కార్ గ్రంథాలయం.. దేవాలయం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- రూ.36 లక్షలతో నిర్మించిన గ్రంథాలయం ప్రారంభోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: ఆస్కార్ గ్రంథాలయం.. ఒక దేవాలయమని, దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని చల్లగరిగ గ్రామంలో సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కనుకుంట్ల చంద్రబోస్ తన సొంత నిధులు రూ.36 లక్షలతో నిర్మించిన నూతన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు.. చంద్రబోస్ తండ్రి రిటైర్డ్ టీచర్ నర్సయ్య చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబోస్ పుట్టిన ఊరి కోసం.. ఇచ్చిన మాట ప్రకారం ఆస్కార్ గ్రంథాలయం నిర్మించారన్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాలో చంద్రబోస్ రాసిన పాటకు ఆస్కార్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంత బిడ్డ ఉన్నత శిఖరాలకు ఎదగడం అభినందనీయమన్నారు. అలాగే గ్రంథాలయానికి ఆస్కార్ పేరు పెట్టడం శుభసూచకమన్నారు. కాగా, ఈ గ్రంథాలయానికి తన వంతుగా రూ. 10లక్షలు కేటాయించనున్నట్లు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యతోనే ప్రతి ఒక్కరూ అభివృద్ధి సాధిస్తారని, ఈ విషయంలో చంద్రబోస్ తన కల నెరవేర్చుకున్నారన్నారు. చంద్రబోస్ కూడా కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నాడు. ఆర్ఆర్ఆర్ సినిమాలో తాన రాసిన పాటకు ఆస్కార్ అవార్డు అభినందనీయమన్నారు. అనంతరం గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

విజ్ఞానవంతులుగా ఎదగాలి..

ఆస్కార్ గ్రంథాలయంలో విద్యార్థులు చక్కగా చదువుకుని విజ్ఞానవంతులుగా ఎదగాలని సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ అన్నారు. తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. చిన్నప్పుడు తాను ఇదే గ్రంథాలయంలో చదువుకున్నానని గుర్తు చేశారు. ఇక్కడే చదువుకుని ఉన్నత చదువు కోసం పట్టణాలకు వెళ్లానని తెలిపారు. ఇటీవల ఆస్కార్ అవార్డు రావడంతో తన సొంత గ్రామానికి వచ్చానన్నారు. ఇంటికి వచ్చిన తాను గ్రంథాలయాన్ని సందర్శించగా శిథిలావస్థలో ఉందన్నారు. దీంతో తన తండ్రి కోరిక మేరకు నూతన గ్రంథాలయ నిర్మాణం చేపట్టాలనుకున్నారన్నారు. ఇందులో భాగంగా గ్రామస్తుల సహకారంతో సొంతంగా రూ.36 లక్షలతో గ్రంథాలయాన్ని నిర్మించానన్నారు. ఈ గ్రంథాలయానికి ఆస్కార్ నామకరణం చేయడం తన పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. విద్యార్థులు, గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌర గ్రంథాలయాల శాఖ సంచాలకుడు ఏవీఎన్ రాజు, జిల్లా గ్రంథాలయాల కార్యదర్శి శ్రీలత, ఎంపీపీ దావు వినోద, ఎంపీఓ, గ్రామ ప్రత్యేకాధికారి రామకృష్ణ, లైబ్రేరియన్ చంద్రమౌళి, రిటైర్డ్ టీచర్ రాజమౌళి, చంద్రబోస్ స్నేహితులు జేఎన్‌టీయూ ప్రొఫెసర్ బాబురావు, వీరారెడ్డి, ఉపాధ్యాయులు కామిడి సతీష్‌రెడ్డి, సూదం సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కొమురయ్య స్ఫూర్తితో రాష్ట్రాభివృద్ధి

ఆర్అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహం ఆవిష్కరణ
- పెద్ద ఎత్తున తరలివచ్చిన కురుమ కుల బాంధవులు



దొడ్డి కొమురయ్య విగ్రహం ఆవిష్కరించి పూలమాల వేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, పక్కన విప్ అయిలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

జనగామ: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ఆర్అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డు క్లాక్ కమాన్ వద్ద పట్టణ కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేశారు. గురువారం ఆయన వర్ధంతి సందర్భంగా సంఘం పట్టణ అధ్యక్షుడు బాల్దె మల్లేశం అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాయిరాం ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. 19 ఏళ్ల వయసులోనే తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులు బాసిన వీరుడు కొమురయ్య అన్నారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ.. ఇలా ఎందరో మహనుబావులు జనగామ జిల్లా గడ్డపై జన్మించి పునీతం చేశారన్నారు. ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనలో ప్రజలు నలిగిపోయారని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ట్యాంకు బండ్‌పై దొడ్డి కొమురయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 3వ తేదీన జరిగే జయంతి రోజున ఆవిష్కరించేలా ముఖ్యమంత్రిని ఒప్పించి, పండగను తలపించేలా వేడుకలు నిర్వహిస్తామన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, అన్నదాతలతో పాటు ప్రతీ పేదకు సర్కారు నుంచి భరోసా దొరికినప్పుడే దొడ్డి కొమురయ్య ఆశయం నెరవేరుతుందని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ విస్నూరు దొర తల్లి రాణి వెంకటజానమ్మ అరాచకాల నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు రెండు పదులు దాటని వయసులో దొడ్డి కొమురయ్య గడీల పాలనను బద్దలు కొట్టారన్నారు. తెలంగాణ ఆకాంక్షకు ఊపిరిపోసిన సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య రగిలించిన స్ఫూర్తితో ఈ ప్రాంత ప్రజలు నిత్యం చైతన్యంతో పేదల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తుంటారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. దోపిడీ, బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసి అతి చిన్న వయసులో వీర మరణం పొందిన దొడ్డి కొమురయ్య బాటలో నడుస్తూ సమాజహితం కోసం పని చేయాలని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, మాజీ మార్కెట్, మున్సిపల్ చైర్మన్లు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కంచె రాములు, విగ్రహ దాత కడకంచి శ్రీనివాస్, కార్యదర్శి జాయ మల్లేశ్, పట్టణ కార్యదర్శి జూకంటి శ్రీశైలం, కోశాధికారి కేమిడి ఉపేందర్, గౌరవ అధ్యక్షులు మోటె శ్రీశైలం, కర్రె కృష్ణ, ఎంగ్రు వైకుంఠం, సంఘ యూత్ జిల్లా అధ్యక్షుడు సేవెల్లి మధు, కౌన్సిలర్ కర్రె శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



సంపత్‌రెడ్డి (ఫైల్)

తొర్రూరు: పెళ్లి కావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఫత్తేపురంలో జరిగింది. ఎస్సై జగదీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుంభం సంపత్ రెడ్డి(38) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్లుగా కుటుంబ సభ్యులు సంబంధాలు చూడగా ఎక్కడా కుదరలేదు. దీంతో ఇక తనకు వివాహం కాదని, చావే శరణ్యమని తలచి కుటుంబీకులు నిద్రలో ఉండగా బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరిన సంపత్‌రెడ్డిని అతడి సోదరుడు యాకూబ్‌రెడ్డి గమనించి ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఉప్పల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీశ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మద్దులపల్లిలో మహిళ..

కాళేశ్వరం : ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మహదేవపూర్ మండలం మద్దులపల్లిలో జరిగింది. ఎస్సై చక్రపాణి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాల్నె వనిత(42)ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది గురువారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన మహదేవపూర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి భర్త సాగర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అసలేం జరిగింది..!

జూన్ 10న మిత్రుడి పుట్టిన రోజు వేడుకల్లో పార్టీ

- వారం రోజుల తర్వాత ముగ్గురికి అస్వస్థత
- రెండు రోజుల వ్యవధిలో ఇద్దరి మృత్యువాత
- మరొకరి పరిస్థితి విషమం



రామన్నగూడెంలో శ్రావణ్ ఇంటి ఎదుట గుమిగూడిన గ్రామస్తులు



బోగోజు శ్రావణ్(ఫైల్)



ఎస్‌కె.రహీం(ఫైల్)

నర్సింహులపేట: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెం గ్రామానికి ఇద్దరు యువకులు రెండు రోజుల వ్యవధితో మృత్యువాత పడ్డారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన వివరాలు గ్రామస్తుల కథనం ప్రకారం.. జూన్ 10వ తేదీన రామన్నగూడెంలో మిత్రుడి పుట్టిన రోజు వేడుకలకు అదే గ్రామానికి చెందిన బోగోజు శ్రావణ్(25), ఎస్‌కె.రహీం(26), తాడూరి ఉపేంద్రచారితోపాటు మొత్తం పది మంది హాజరయ్యారు. అక్కడ కల్లు, మద్యం సేవించారు. అనంతరం ఇళ్లకు వెళ్లిపోయారు. వారం రోజుల తరువాత శ్రావణ్, రహీం, ఉపేంద్రాచారి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు మహబూబాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం.. అక్కడి నుంచి హైదరబాద్ యశోద.. తర్వాత నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శ్రావణ్ బుధవారం, రహీం గురువారం మృతి చెందారు. ఉపేంద్రాచారి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. పార్టీలో పది మంది పాల్గొనగా ఈ ముగ్గురికే ఇలా ఎందుకైందనే దానిపై పలు రకాల చర్చజరుగుతోంది. అసలు వారు తాగిన కల్లు ఏమైనా కల్తీ అయిందా.. లేక తీసుకున్న ఆహారంలో ఏమైనా జరిగిందా.. కల్లు తీసిన లోట్టిని ఇంతకు ముందు గడ్డి మందు పిచికారీకి వినియోగించారా.. మరేదైనా కారణం ఉండవచ్చా.. అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కేసు దర్యాప్తు చేస్తున్నాం..

శ్రావణ్ తల్లి జయప్రద వీరి మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసిందని, ఆ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గండ్రాతి సతీశ్ తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టు ఆధారంగా మరణాలకు కారణం తెలుసుకుంటామని పేర్కొన్నారు.

రామన్నగూడెంలో విషాదం..

మృతుడు శ్రావణ్ చిన్న వయసులోనే తండ్రి చనిపోగా తల్లి జయప్రద అన్ని తానై పెంచి పెద్ద చేసింది. చేతికందిన కొడుకు మృతి చెందడంతో తల్లితో పాటుగా వృద్ధులైన నానమ్మ, అమ్మమ్మ దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరొకరు ఎస్‌కె.రహీం గ్రామంలో కారోబార్‌గా పని చేస్తున్నాడు. పేద కుటుంబం.

టీజీఐఐసీ భూముల ఆక్రమణపై కఠిన చర్యలు

పరిశ్రమల పేరిట పక్కదారి పట్టించే వారి నుంచి అపరాధ రుసుము వసూలు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- వరంగల్ టీజీఐఐసీ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు

సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) భూములను ఆక్రమణల నుంచి పరిరక్షించుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. సంస్థ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. పరిశ్రమల పేరుతో భూములు పొంది తర్వాత వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిని గుర్తించి అపరాధ రుసం వసూలు చేయాలని చెప్పారు. జిల్లాల వారీగా సంస్థకున్న ఖాళీ భూములను కాపాడేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ కార్యాలయాన్ని గురువారం మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు.

భూములను పక్కదారి పట్టిస్తే చర్యలు

వరంగల్ జిల్లాలో పరిశ్రమలకు రాయితీ ధరపై కేటాయించిన రాంపూర్, మడికొండ పారిశ్రామిక వాడల్లో వాణిజ్య కార్యకలాపాలు జరుగుతుండడంపై మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సర్వే చేసి కమర్షియల్ వినియోగానికి మార్చిన భూములను గుర్తించాలని ఆదేశించారు. కేటాయింపులు పొందిన వారి నుంచి నిబంధనల ప్రకారం రోడ్ల వెడల్పును బట్టి 20 శాతం, 50 శాతం జరిమానా వసూలు చేయాలని సూచించారు. అన్ని జిల్లాల్లో ఐటీ పార్కులు సాఫ్ట్‌వేర్ పరిశ్రమలన్నీ హైదరాబాద్‌లోనే కేంద్రీకృతం కాకుండా.. జిల్లాలకు తరలివెళ్తే భవనాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని శ్రీధర్ బాబు వెల్లడించారు. హనుమకొండలోని కాకతీయ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కును సందర్శించారు. ప్రస్తుతం అందులో ఆరు సాఫ్ట్‌వేర్ కంపెనీలు పనిచేస్తున్నాయని, మరో రెండు నెలల్లో 8 సంస్థలు కార్యకలాపాలు సాగించేందుకు సంప్రదింపులు జరుపుతున్నాయని చెప్పారు. ఐటీ పార్కులో 64 సీట్ల ప్లగ్ అండ్ ప్లే సౌకర్యం ఉండగా సగం సీట్లను సాఫ్ట్‌వేర్, యానిమేషన్ సంస్థలు లీజుకు తీసుకున్నట్లు తెలిపారు. ఎస్ఆర్ఐలు, ప్రధాన ఐటీ కంపెనీలు జిల్లాల్లో ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఐటీ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీని వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇది ఆఫీస్ అంటారా?

- అధికారులు ఏం చేస్తున్నారు?
- కొత్త ఫర్నిచర్ ఏర్పాటు చేయండి
- మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలు

వరంగల్: ఇది ఆఫీస్ అంటారా...ఇంత అధ్వానంగా ఉంటే ఇన్ని రోజులు అధికారులు ఏం చేస్తున్నారని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వరంగల్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టీజీఎస్ఐఐసీ)జోనల్ కార్యాలయాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. కార్యాలయంలో ఫైళ్లు ఎక్కడ పడితే అక్కడ ఉండడం, ర్యాక్‌లు సరిగా లేకపోవడం, కుర్చీలు సరిగా లేక పోవడంపై జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఆఫీస్ అంతా కలియ తిరిగి ఉద్యోగులను పలకరించారు. ఈసందర్భంగా ఓ ఉద్యోగి కూర్చున్న కుర్చీకి హ్యాండిల్ లేకపోవడం గుర్తించిన మంత్రి.. అమ్మా నీవు ఎప్పటి నుంచి పనిచేస్తున్నావు..కుర్చీకి హ్యాండిల్ లేకుంటే మార్చాలని అధికారులను అడగొద్దా అన్నారు. రాష్ట్ర టీజీఎస్ఐఐసీ అధికారులకు ఫోన్ చేసి వెంటనే కార్యాలయంలోని ఫర్నిచర్, సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



కార్యాలయంలోని ఫర్నిచర్‌పై ఉద్యోగితో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు